# కళ్యాణం కమనీయం

గొడవర్తి జ్ఞానకోశ్యామసుందర్

"రావోయ్ ఈశ్వర్! రావయ్యా పెళ్లికొడుకా! ఇదిగో సునందా పెళ్లికొడుకొచ్చాడు. వేడిగా కాస్త కాఫీ తీసుకురా మా ఇద్దరికి'' వంట ఇంట్లోని భార్యకు వినబడేలాగా అన్నాడు సదానందం.

''మీక్కావాలి కాఫీ అని అడగొచ్చుగదా! మధ్యలో వాడితో వంతెందుకు'' ఇద్దరికీ చెరో కప్పు ఇచ్చి కూచుంటూ అంది సునంద.

''అవునూ మీరేంటి వాడ్ని పెళ్లికొడుకంటూ వెంటబడ్డారు? ఏదో ఇద్దరమ్మాయిల్ని చూపుల్లో చూసి రాగానే పెళ్లికొడుకయ్యాడా వాడు'' నవ్వుతూ రెట్టించింది సునంద.

'' ఎందుక్కాకూడదూ! పెళ్లే వద్దని ఇన్నాళ్లూ భీష్మించుకొన్న ఈశ్వర్ పెళ్లాడుతానని ఒప్పుకొన్నాడు గదా. ఆ ప్రహసనానికి నాంది పలికాడు గదా!!'' పెద్దగా నవ్వుతూ అంటున్న సదానందం మాటలకి మొహమాటంగా ఓ నవ్వు పూయించాడు ఈశ్వర్ తన వదనంలో.

'' ఏమిటోయ్! అలా డల్‌గా ఉన్నావు. కొంచెం కన్‌ఫ్యూషన్‌లో పడ్డావా ఏంటి పెళ్లి చూపులనగానే. ఇది అందరికీ సహజమేలే తొందరపడకు. టేక్ యువర్ ఓన్ టైమ్. మా టైమ్‌లో మాకిలాంటి సలహా ఇచ్చినవారే కరువయ్యారు. నేను చూడు ఎంత తొందరగా పెళ్లి చూపులు చూసీ చూడగానే మీ పిన్నికి ఓకే చెప్పేసి యిప్పుడు అనుభవిస్తున్నాను. నాలాగా నువ్వు తొందరపడి ఆనక నాలా పశ్చాత్తాపపడకు. తర్వాత బాధపడి ప్రయోజనం లేదు. నిదానమే ప్రధానం. గుర్తుంచుకో బాగా'' భార్యవైపు మురిపెంగా చూస్తూ అన్నాడు కొంటెగా సదానందం. అయోమయంగా చూస్తున్న ఈశ్వర్ ముఖకవళికలు గమనిస్తూ సునంద కూడా అంతే చిలిపిగా'' అవున్రా ఈశ్వర్! పెళ్లయిన ముప్ఫై ఏళ్లకి మీ బాబాయికి తొందరపడి నిర్ణయం తీసుకున్నానని ఆలోచన వచ్చినట్లుంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. విడాకులు తీసుకోవడానికి నేను రెడీనే. ఏ బాదరబంది లేకుండా స్వేచ్ఛగా హాయిగా ఉండచ్చు'' చిరుకోపం ప్రదర్శిస్తూ అంది సునంద.


''సరే లేవోయ్! నువ్వు బాధపడతావని సర్దుకొంటున్నాను. ఈ జన్మకింతేలే అని కాంప్రమైజ్ అవుదాంలే! విడాకులు వద్దులే! తమలపాకులు క్రమంగా ఇస్తుంటే చాలులే'' కొంటెగా అంటున్న భర్త మాటలకి మురిపెంగా నవ్వింది సునంద.

ఈశ్వర్‌కి ఆ దంపతులను చూస్తుంటే ముచ్చటగా వుంది. అసలు వాళ్లని ఎప్పుడు చూసినా అలా ఒకరిమీద ఒకరు బాణాలు వదులుతూ, కవ్విస్తూ కవ్వించుకొంటుంటారు. ఎంతో అన్యోన్యంగా, సరదాగా ఉంటారు.

''అవునూ, నువ్వు ఉమెన్స్‌కాలేజీలో లెక్చరర్ గదా. మనవాడికెవరినైనా తగిన జోడీ చూడలేకపోయావా! ముడిపెట్టేద్దాం'' భార్యని ప్రశ్నించాడు సదానందం.

''భలే సలహానే. ఇప్పటి ఆడపిల్లలు ఇంకా పాతకాలంలోగా ఉన్నారనుకొంటున్నారా! అసలు భూమి మీద నడవటం లేదు. ఏదో కలల్లో వాస్తవానికి భిన్నంగా విహరిస్తున్నారు. ఆ మాటకొస్తే అబ్బాయిలేం తక్కువ కాదు. కాకపోతే కొంచెం మెరుగు.

అమ్మాయిలు ఇప్పుడే బ్యూటీపార్లర్ నుంచి నేరుగా ఓ ఫ్యాషన్ పెరేడ్‌కి వచ్చినట్లుగా కాలేజికి వస్తున్నారు. పెద్దవాళ్లంటే గౌరవం లేదు. కారిడార్‌లో కనిపించినా ఆఫ్టాల్ ఈ తెలుగు లెక్చరర్‌తో ఏం పనిలే అనుకొంటున్నారు. ఇలాంటి వాళ్లలోంచి ఎలా పెళ్లికూతుర్ని ఎంపిక



చేయడం'' కొంచెం బాధగా అంది సునంద.

''అయినా, నాల్గురోజుల క్రితం అక్కయ్య ఫోన్ చేసి ఈశ్వర్ వస్తున్నాడు. అక్కడ రెండు సంబంధాలు చూసి ఏదో ఒకమ్మాయిని ఖాయం చేస్తాడు. మీరు కొంచెం తోడుగా వుండండి చాలని చెప్పింది గదా! వాడు ఒకె చేస్తే తర్వాత మేం వచ్చి చూస్తామని అన్నప్పట్నించి నాకు అదే ఆలాపనగా వుంది. ఆత్రుతగా వుంది. మధ్యలో మీ ఉచిత సలహాలేమిటో'' కొంచెం నిష్టూరంగా అంది సునంద.

''మధ్యలో నీకెందుకోయ్ ఆ టెన్షన్. రాబోయే అమ్మాయి నీతో కాదుగా సహజీవనం చేయబోయేది. మీ అక్కయ్యా, వాళ్లు వాళ్లు చూసుకొంటారు. నువ్వేమీ కంగారుపడకు'' అన్నాడు సదానందం కాఫీ సిప్‌చేస్తూ.

''అలా మాత్రం అనకండి. ఆ వచ్చే కోడలు మా అక్కయ్యని సరిగ్గా అర్థం చేసుకొని, వాళ్లలో కలిసిమెలసి పోవాలని నా కోరిక. పాపం అది మొదటినుంచి స్వేచ్ఛలేని జీవితం అనుభవించింది. అందుకని కోడలొచ్చాకైనా మా అక్క సుఖపడాలని నా కోరిక. అలా అని వస్తూనే అత్తగారి కాళ్లు పట్టక్కర్లే'' అన్నది సాలోచనగా సునంద.

''అవునోయ్ ఈశ్వర్, అవన్నీ జ్ఞాపకం ఉంచుకొని డెసిషన్ తీసుకో. మొన్న చూసి వచ్చిన అమ్మాయిల గురించి ఆలోచించు. ఎటుకూడినా మీరందరూ సుఖంగా వుండాలనేది మాత్రం ఖచ్చితంగా గుర్తుంచుకో'' స్నేహితుడిలాగా సలహా ఇచ్చాడు సదానందం.

''సరే అలాగే బాబాయి! పిన్నీ నేనిప్పుడే అలా పార్క్‌దాకా వెళ్లివస్తా. అలాగే ఎల్లుండికి రైలు రిజర్వేషన్‌గూడా చేయించుకొచ్చేస్తా! మళ్లీ పనులు మరుగున పడతాయి ఆలస్యమైతే'' అన్నాడు ఈశ్వర్.

''అదేమిట్రా అప్పుడే వెళ్లటం ఏమిటి? ఇంకో రెండు రోజులైనా వుండు. ఏదో ఈ పెళ్లి చూపుల వంకతో వైజాగ్ వదిలావు కాని, ఎన్నాళ్లనుంచి రమ్మన్నా ఏదో సాకుతో ఎగ్గొట్టావు. ఉత్తప్పుడు ఎలాగూ రావట్లేదుగదా. ఏం అంత తొందర!'' నిలదీసింది సునంద.

''అది కాదు పిన్నీ! ఆఫీసులో పనివత్తిడి ఎక్కువగానే వుంది. పైగా కొత్త మేనేజరు. ఇదిగో పెళ్లివారికి ఫోన్ చేసి చెప్పేశాం నువ్వొస్తున్నావని, మరి నీదే ఆలస్యం అంటూ అమ్మా నాన్నగారు వత్తిడి చేయటంతో బతిమాలి రెండ్రోజులు సెలవు మంజూరు చేయించుకొనేసరికి అతి కష్టమయ్యింది. లేకపోతే వుండటానికేమి మీ దగ్గర'' వివరించాడు ఈశ్వర్.

'' ఉద్యోగం అన్నాక ఇవి తప్పవులే. లెక్చరర్‌లకు ఏమి తెలుసు ఈ సాధక బాధకాలు. హాయిగా ఏడాదికి మూణ్ణాలుగు నెలలు తీరికే. ఈ ఇబ్బందులు వారికి అంతగా బోధపడవులే. అయితే తొందరగా పప్పణ్ణం పెట్టించేయి'' దొరికిన అవకాశం వదులుకోకుండా భార్యని ఆటపట్టిస్తూ అన్నాడు సదానందం.

## వృద్ధాప్యం వచ్చేది ఎప్పుడు?



''అరవై దాటిన తర్వాత ఏ వయస్సువాళ్లైనా వృద్ధులే!'' అంటారు ఆచార్య చేకూరి రామారావు.

''ఈ రోజుల్లో అరవై ఏళ్లకు ముసలితనం వస్తుందనుకోకూడదు. డెబ్భై ఏళ్లు దాటిం తర్వాత వార్ధక్యం అంటే అర్థం చేసుకోవచ్చు నంటారు సుప్రసిద్ధ రచయిత్రి రంగనాయకమ్మ –

''డెబ్భై దాటిన తర్వాత ముసలితనం వస్తుం దనుకోకూడదు. ఎనభై దాటిన వాళ్లను వృద్ధులనటం సబబుగా వుంటుంది'' అంటారు నిత్య చైతన్యశీలి డా. సి నారాయణడ్డి.

రచయితలు నిత్య యవ్వనులు గదా!

సేకరణ; రామమోహనరాయ్

''తొందరగా వచ్చేయ్ ఈశ్వర్'' అంటూ భర్త మాటలకి రుసరుసలాడుతూ లోనికి వెళ్లింది సునంద.

పార్కులో అడుగుపెట్టిన ఈశ్వర్ ముక్కుపుటాలకి ఎండిననేలన తోటమాలి అప్పుడే వదిలిన నీటితో కలసి ఒక విచిత్రమైన కమ్మని సువాసన సోకింది. ఆ పరిసరాలంతా హాయిగొలుపుతున్నాయి.

పచ్చికమీద వెల్లికిలా పడుకొని చేతులమీద తలపెట్టుకొని ఆకాశంలోకి దృష్టిసారించాడు. సంజెవెలుగుల కాంతుల్లో, మబ్బుతునకల డిజైన్‌తో లేత నీలంరంగు చీరె కట్టింది ఆకాశం. కొన్ని మేఘాలు ఆతృతగా ఎక్కడికో వెళుతున్నాయి. ఈశ్వర్ మనసు కూడా మొన్న పెళ్లిచూపుల్లో చూసిన అమ్మాయిలవైపు మళ్లింది.

తేనెలో రంగరించినట్లున్న బంగారు మేనిఛాయ, ఆకర్షణీయమైన ఒంపుసొంపులు, గులాబీరంగు పెదవులు, చురుకైన చూపులు వెరసి ఓ అందమైన విలాసవంతమైన సౌందర్యం మనో ఫలకం మీద ప్రత్యక్షమైంది. పెళ్లి చూపుల్లో కళ్లు అప్పగించి చూశాడు ఎబ్బెట్టుగా అనిపించినా స్మిత అందం ఆకర్షణ అలాంటివి. అతనేం చేస్తాడు. అందరిలాగా సమ్మోహితుడైనాడు.

''హాయ్ అయామ్ స్మిత'' అంటూ యధాలాపంగా కరచాలనం కోసం చేయిచాపిన అమ్మాయిని ఈశ్వర్ కిరుప్రక్కలా కూర్చొన్న సునంద, సదానందం విభ్రాంతిగా చూశారు.

బాబ్డ్‌హెయిర్, టైట్ జీన్ ప్యాంట్, స్లీవ్‌లెస్ టాప్, ఓ చేతిలో సెల్, ఇంకోచేతిలో మ్యాచింగ్ పర్స్‌తో ఇంట్లోకి అప్పుడే వచ్చిన స్మిత తనను తాను అలా పరిచయం చేసుకొంది.

''మా అమ్మాయి స్మిత చాలా మాడ్రన్. అఫ్‌కోర్స్ మేమంతా అంతేలెండి. ఫ్రెండ్ బర్త్‌డే పార్టీ వుందంటే పబ్‌కి వెళ్లివచ్చింది. తనకు సర్కిల్ చాలా ఎక్కువ. ఎప్పుడూ ఎక్కడో అక్కడ పార్టీ అంటూ వెళ్తుంటూంది. మరీ పల్లెటూరి అమ్మాయిల్లా కాకుండా వీకెండ్స్‌లో డిస్కోల్లో – పబ్స్‌లో ఏదో ఒక సెలబ్రేషన్ ఏర్పాటు చేసుకొంటుంటారు.

"Nowadays youth know how to enjoy life. As a parent it is our responsibility to encourage them. What do you say" కాలు మీద కాలు వేసుక్కూర్చొని కళ్లెగరేస్తూ అన్న స్మిత తల్లి పంకజం మాటలకి సునంద మొహమాటంగా ఒ నవ్వు నవ్వి ఊరుకొంది.

ఈశ్వర్ ఉద్యోగం గురించి వివరంగా అడిగిన స్మిత తండ్రి ప్రకాష్ మాత్రం సదానందం మాట్లాడినా ముక్తసరిగా సమాధానాలు చెప్పాడు.

"Yes tell me about your future plans" అడిగింది స్మిత ఈశ్వర్‌ని పరీక్షగా చూస్తూ ఇరవైరెండో శతాబ్దానికి చెందిన ఆడపిల్లలా!

''మా స్మితది చాలా సోషల్ మూవింగ్ నేచర్. పాత కాలపు అలవాట్లు అస్సలు ఇష్టముండదు. షి లైక్స్ మోడ్రన్ కల్చర్'' అంటూ వత్తాసు పలుకుతున్న పంకజం మాటలకు అడ్డువస్తూ ''ఇంట్లో ఇంకా ఎవరెవరు ఉంటారు? మీ అత్తగారూ , మావగారూ.... '' అంటూ అర్థోక్తిగా ఆపేసింది సునంద.

''యూ మీన్ ప్రకాష్ వాళ్ల మమ్మీ డాడీనా? వాళ్లిక్కడ ఎందుకుంటారు'' అంటూ పెద్దగా నవ్వి ''ఈ ఓల్డ్ పీపుల్ ఇంట్లో ఉంటే మనకి చాలా డిస్టర్బెన్స్. ప్రతీదాంట్లో తల దూరుస్తారు. వాళ్ల తరంలో ఏమీ అనుభవించి ఉండకపోవటంతో ఈ కాలపు ధోరణి వాళ్లకి వింతగా వుంటుంది. కాలానుగుణంగా మారాలి కదా! పిల్లలకి ఫ్రీడమ్ ఇవ్వటం కూడా వాళ్లకు నచ్చదు. స్మితను కూడా చిన్నప్పుడు వాళ్లు అలా ఉండు ఇలా ఉండకు

అంటూ వేధించేవారు. అందుకే స్మితక్కూడా వాళ్లంటే ఇష్టంలేదు. నాక్కూడా అంత పేషన్స్ లేదు. వారితో వేగలేను. అందుకే వాళ్లని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేర్పించాం. నెలనెలా కొంత మనీ వాళ్ల మెయిన్‌టెనెన్స్ కోసం పంపమని ప్రకాష్‌కి చెప్పాను'' గుక్కతిప్పుకోకుండా చెప్పింది పంకజం.

''పాతకాలపు ధోరణిలో ఈ పెళ్లిచూపులూ వగైరా లేకుండా ఎక్కడైనా మంచి పార్టీ ఏర్పాటు చేద్దామనుకొన్నా. కానీ ఈశ్వర్ ఇవాళే వస్తున్నాడని నిన్నరాత్రే మీ అక్కయ్య చెప్పటంతో టైమ్ లేక ఎగ్రీ అవవలసి వచ్చింది. అసలు స్మితకు ఈ తతంగమంతా ఇష్టంలేదు. కాని తప్పలేదు'' వివరించింది పంకజం. స్మిత లోపలికెప్పుడు వెళ్లిందో గమనించలేదు సునంద.

చూపులు మాటలు ఈ రకంగా ముగియటంతో ముగ్గురూ లేచి

## ఆశ నిరాశ

**టార్జాన్** - ది వండర్ కార్ కి ఆక్సిడెంట్ కావడంతో అయేషా టకియా ఖంగుతింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద దారుణంగా పల్టీలు కొట్టింది. అయినా కూడా ఆమెకి అవకాశాలు వస్తూనే వున్నాయి. అయితే ఆ సినిమాల్లో ఆమె వేస్తున్న పాత్రలేవీ కెరీర్‌కి ఉపయోగపడేవి కావు. సినిమాలు ఆశాజనకంగా లేకపోవడంతో అయేషా ఒకబ్బాయి ప్రేమలో పడింది. సినిమా ఇండస్ట్రీ బిజినెస్ మాగ్నెట్‌గా వున్న అతను త్వరలోనే అయేషాతో ఒక సినిమా తీయబోతున్నాడు. సో .... బెస్టాఫ్ లక్ అయేషా

బయటకు వచ్చారు. ''మా స్మిత మీకు ఓకే అవుతే నెక్ట్స్ ప్రొసీడ్ అవుదాం'' అన్నాడు ప్రకాశం గేటుదాకా వచ్చి సదానందంతో.

''ఏ విషయం ఫోన్ చేసి చెప్తాం లెండి'' అన్నాడు సదానందం.

''క్వాలిఫికేషన్‌తో పాటు స్మితది చక్కటి సహజమైన అందం. కాకపోతే ఈ కాలపు పోకడలు కొంచెం ఎక్కువ'' అన్నాడు సదానందం.

''అవునవును. స్టన్నింగ్ బ్యూటీ! కానీ'' భర్తకు వంతపాడుతూ అంది సునంద. వారి మాటలు మౌనంగా వింటూ పరిసరాల్లోని అందాలు చూస్తూ ఉండిపోయాడు ఈశ్వర్.



పార్కులో పిల్లల కలకలం వినిపించడంతో ఈ లోకంలోకి వచ్చాడు ఈశ్వర్. సంజెవెలుగులు క్రమంగా అంతరించి చీకటి చిక్కబడుతోంది. ఆకాశం చుక్కల చీరెలోకి మారింది. కొంటె చందమామ పార్కులోని చెట్లతో దాగుడుమూతల సయ్యాట ఆడుతున్నాడు. పిల్లతెమ్మెర మనస్సును సేదదీరుస్తున్నట్లుగా వీస్తోంది. ఈశ్వర్ మనసులోకి నిన్న చూసొచ్చిన మీనా మెదిలింది.

చామనఛాయ, తీరైన కనుముక్కు తీరు, ఒత్తుగా పొడుగ్గా వున్న జడలో ఒకే ఒక గులాబీతో ఆహ్లాదకరమైన చిరునవ్వుతో పొందిగ్గా కూర్చొన్న ఆమె రూపం మీనా కళ్లముందు ఇంకొకసారి కదిలింది.

ఇంటినిండా తీర్చిదిద్దిన రంగవల్లులు, పసుపురాసిన గడపలు, ప్రొద్దున కట్టిన మామిడి తోరణాలతో ఇంటినిండా సందడిగా తిరుగుతున్న బంధువర్గంతో హడావిడిగా ఉన్న ఆ పొదరింట్లో అడుగుపెట్టేసరికి అందరూ సాదరంగా ఆహ్వానించారు. మంచినీళ్లు, కాళ్లకి నీళ్లు ఇచ్చి కుశలమడిగారు. ముందుగదిలోంచి సన్నాయి మంద్రస్థాయిలో స్వాగతం పలుకుతోంది.

మీనా తండ్రి, తన అన్నదమ్ముల్ని, వృద్ధులైన తల్లిదండ్రుల్ని వివరంగా పరిచయం చేసాడు సదానందం, సునందలకి. అంతా మాట్లాడుకొంటుంటే ఈశ్వర్ మాత్రం గోడలమీద వున్న రవివర్మ, దామెర్ల రామారావు పెయింటింగ్, వృద్ధ దంపతుల నడివయసు ఫోటోలు పరీక్షగా ఆసక్తిగా చూస్తూ కూర్చొన్నాడు.

యింతలో కాఫీకప్పులు ట్రేలో ఉంచుకొని మీనా నెమ్మదిగా నడుస్తూవచ్చి ట్రే టీపాయ్ మీద ఉంచి ముగ్గురుకి నమస్కరించి అందరికీ కాఫీ కప్పులందించింది. లేత నీలంరంగు చుడీదార్ ఒక వింత అందం ఆపాదించింది. అప్పుడే కడిగిన ముత్యంలా ఫ్రెష్‌గా కనిపించింది.

''బాబూ ఈశ్వర్ మా అమ్మాయి మీనాక్షితో ఏమన్నా మాట్లాడదలచుకొంటే, బయట అలా తోటలోకి వెళ్లమ్మా'' అన్నాడు మీనా పెదనాన్న.

''అవున్నాయనా. వెనుకటి రోజులు కావు కదా! చదువులు ఉద్యోగాలు అభిరుచుల గురించి ఒకరితో ఒకరు చర్చించుకొని ఒక అవగాహనకు రావడం

మంచిది. అవసరం కూడాను. ఈ కాలం పద్ధతి ఇదే కదా'' నవ్వుతూ అన్నారు మీనా తాతగారు.

''విద్యార్హతలు వగైరా ముందే తెలుసుకొచ్చాముగా! ఇంకా పెద్దగా అడిగేదేముంది. ఏదో లాంఛనం తప్ప. ఏం ఈశ్వర్ ఏమైనా మాట్లాడతావా'' అన్నది సునంద.

ఈశ్వర్ చిరునవ్వుతో మీనావైపు చూశాడు. మీనా కూడా చటుక్కున ఈశ్వర్‌ని చూసి కళ్లు దించుకొంది. కళ్లతో తప్ప ఇంకేమీ మాట్లాడుకోని మీనా– ఈశ్వర్‌లవైపు మురిపెంగా చూస్తూ '' ఏమ్మా... మీనా పుస్తకాలేవైనా చదువుతావా'' బల్లమీద 'కళ్యాణ కల్పవల్లి' పుస్తకం చూస్తూ అడిగింది సునంద.

'' ఇప్పటి రోజుల్నిబట్టి సాఫ్ట్‌వేర్ కోర్సులు చేసింది గాని మా అమ్మాయికి తెలుగు సాహిత్యం మీద మక్కువ ఎక్కువే'' వివరించింది మీనా తల్లి గాయత్రి.

''జాబ్ చెయ్యటంపై మీ అభిప్రాయం ఏమిటి'' చివరికి అడిగాడు ఈశ్వర్.

''పరిస్థితుల్ని బట్టి, అవసరమైతే నేను రెడీనే! నో అబ్జెక్షన్'' నెమ్మదిగానే ఖండితంగా చెప్పింది మీనా నవ్వుతూ.

చక్కటి సమాధానంతో సంతృప్తి చెందిన మగపెళ్లివారి బృందం అంతా హాయిగా చిరునవ్వులు చిందించారు.

''రండి. మా ఇల్లు చూద్దురుగాని'' అన్న గాయత్రి మాటలతో సునంద ఆవిణ్ణి అనుసరించింది. మగవాళ్లు పిచ్చాపాటిలో మునిగితే, ఈశ్వర్ మీనా చిన్నబాబాయితో క్రికెట్ చర్చల్లో మునిగిపోయాడు.

పెరడంతా పూలమొక్కలు, సమైక్య జీవనానికి నిదర్శనంగా పిల్లా, పాపలతో నిండుగా వున్న కుటుంబానికి సంకేతంగా చుట్టూ పిలకలతో ఉన్న అరటి చెట్లు చూడముచ్చటగా వున్నాయి.

కాఫీ, టిఫిన్‌లు అయింతర్వాత బయలుదేరిన సునందకు బొట్టుపెట్టి రెండు అరటిపళ్లూ ఓ పూలచెండూ చేతిలో ఉంచి ''మరీ పూర్తిగా సనాతనంగా కాని, అలాగని మరీ ఆధునిక సంప్రదాయాలు పాటించకుండా, వాటిని సమపాళ్లలో పాటిస్తూ రెండిట్లోని మంచినీ గ్రహిచి మసలుకొంటారు మా అత్తగారు, మామగారు. వారినే మేమందరం అనుసరిస్తాం మా ఇంట్లో. నాగరికత వెర్రితలలు వేసే ఈ కాలంలో మమ్మల్ని చూసేవారికి కొంత హాస్యాస్పదంగా ఉంటుంది లెండి'' అన్నది గాయత్రి.

''నిజమే మీరు చెప్పింది. మనదైన సంస్కృతిని వదిలి, ఆధునికత నాగరికత పేరుతో సాంప్రదాయాల్ని గాలి కొదిలేసే వారు చేసే వింత ప్రవర్తన అంత హర్షించదగ్గదేమీ కాదు. మీదే సరైన పద్ధతి'' మెచ్చుకోలుగా అంది సునంద.

''తొందరలో వచ్చి కలుస్తానని'' మర్యాద పూర్వకంగా చెప్పాడు మీనా తండ్రి. మగవారంతా గేటువరకు వచ్చి వీడ్కోలు చెప్పారు.

దీర్ఘాలోచనలో ఉన్న ఈశ్వర్ చుట్టూ పరిసరాలని గమనించలేదు. వాచ్‌మెన్ విజిల్ వినిపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి ఆలోచనల ప్రవాహంలోంచి బయటపడి ఇంటి ముఖం పట్టాడు.

''ఇంతాలస్యం చేశావేమిటి ఈశ్వర్. ఇంత దాకా నీకోసం ఎదురుచూసి ఇప్పుడే మీనా నాన్నగారు, పెదనాన్నగారు వెళ్లారు'' అంటూ గుమ్మంలోనే ఎదురొచ్చి ప్రశ్నించింది సునంద.

''అవునయ్యా మన సంబంధం వారికి నచ్చిందట. మీ అభిప్రాయం ఏమిటీ అంటూ వచ్చారు. మరి నీ నిర్ణయం ఏమిటి?'' ముఖంలోకి పరీక్షగా చూస్తూ అన్నాడు సదానందం.

ఒక్క నిముషం బదులివ్వలేదు ఈశ్వర్.

''అహహ! తొందరేం లేదు. బాగా ఆలోచించే నిర్ణయం తీసుకో. నీ మనస్సుకు నచ్చిన అమ్మాయినే ఎంచుకో. పెళ్లనేది అబ్బాయికైనా అమ్మాయికైనా జీవితంలో ఎంతో ముఖ్య ఘట్టం. ఓ టర్నింగ్ పాయింట్'' అన్నది సునంద.

'' ఆగాగు. నీ లెక్చర్‌తో వాణ్ణి ఉక్కిరిబిక్కిరి చెయకోయ్. నెమ్మదిగా వాడే చెప్తాడులే! తొందరపెట్టకు'' నవ్వుతూ భార్యని సున్నితంగా వారించాడు సదానందం.

'' ఆలోచించడం ఇంకా ఏమీ లేదు పిన్నీ. నిర్ణయం తీసుకొన్నా! నాకు మమ్మీ డాడీ కల్చర్ వద్దు. చక్కటి అమ్మా నాన్న సంస్కృతే కావాలి అనుకొంటున్నాను.''

''అంటే'' అర్థం అయ్యీ అవ్వనట్టుగా అడిగింది సునంద.

''అమ్మా నాన్నగార్ని రమ్మని కబురు చెయ్యి పిన్నీ. వచ్చి మీనాని చూస్తారు'' కొంచెం బిడియంగా అన్నాడు ఈశ్వర్.

'' ఓ కంగ్రాట్యులేషన్స్ మై బాయ్. నీ నిర్ణయం ఎలా ఉంటుందోనని నేను మీ పిన్ని తర్జన భర్జన పడుతున్నాం. మా టెన్షన్ తగ్గించావు'' అన్నాడు సదానందం ఆనందంగా.

''అవున్రా ఈశ్వర్. సరైన నిర్ణయం తీసుకొన్నావు. ఈ తరం వాళ్లకి పెద్దవాళ్ల పొడ ఎంత మాత్రం గిట్టట్లేదు. పుష్కలంగా డబ్బొస్తోంది. నలుగురు ఫ్రెండ్స్‌తో కల్సి లైఫ్ ఎంజాయ్ చెయ్యటమే జీవితమనుకొని కన్నూ మిన్నూ కానకుండా ప్రవర్తిస్తున్నారు. ఈ కాలం వారికి ఆ స్మిత తల్లి చెప్పినట్టు సంప్రదాయం విలువలు అక్కర్లేదు. అంతా డబ్బుమయం. బాంధవ్యాలు, బంధుత్వాలు ఏం లేవు వారికి. ఏ గూటి చిలుక ఆ గూటి పలుకే పలుకుతుందని, ఆమె పెంపకంలో వున్న స్మిత ధోరణి అందుకే అలా వుంది'' విశదపరచింది సునంద.

''ఎందరో విదేశీయులు మన సంస్కృతి సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక ధార్మిక భావాలకు ముగ్ధులై అవి ఆచరించాలని వారు పుట్టిపెరిగిన దేశాల్నొదిలి ఇక్కడ స్థిరపడుతుంటే మనతరంలో కొందరు కేవలం భౌతికవాంఛతో నిండిన పాశ్చాత్య సంస్కృతే గొప్పదని ఆ వ్యామోహంలో పడి సమిధల్లా భస్మమైపోతున్నారు'' ఆవేశంగా చెప్తున్న సునంద చెయ్యి పట్టుకొని ఆపుతూ.....

''ఓ భారతనారీ! ఇంతటితో ఈ లెక్చర్‌కి స్వస్తిపలికి మాకు అన్నప్రాశన ప్రాప్తం కలిగించవలసిందిగా ఈ దీనుడు వేడు కుంటున్నాడు. త్వరలో 'మీనాక్షి సుందరేశ్వర' కళ్యాణం ఏర్పాటు చేసుకోవాలి గదా!'' అన్నాడు చేతులు జోడించి.

''శ్రోతల కోరిక మన్నిస్తున్నాం. భోజనాలకి లేవండి. రెండు నిముషాల్లో అక్కయ్యకి ఈ శుభవార్త ఫోన్‌లో చెప్పొచ్చేస్తా'' అంటూ ఇంట్లోకి వడివడిగా నడిచింది సునంద.

★

